క్లుప్తంగా

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 31వ వార్డులో కేంద్ర బలగాలతో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ (కవాతు) నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ఎం.సత్యనారాయణ, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

అదనపు పోలీసు బలగాలతో కవాతు


చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): రానున్న ఎన్నికల నేపథ్యంలో మండలంలోని చాగంటివారిపాలెం, లంకెలకూరపాడు గ్రామాల్లో ముందస్తు చర్యలలో భాగంగా అదనపు పోలీసు బలగాలతో ఆదివారం కవాతు నిర్వహించారు. స్థానిక పోలీసు సిబ్బందితో పాటుగా సీఐఎస్ఎఫ్-981 బెటాలియన్‌కు చెందిన 45 మంది సిబ్బందితో ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు. రూరల్ సీఐ రాంబాబు, ఎస్ఐ హజరతయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వస్వతి శిశుమందిరాలు క్రమశిక్షణకు నిలయాలు




సత్తెనపల్లి: శ్రీ సర్వస్వతి శిశుమందిర్ పాఠశాలలు బోధనతో పాటు క్రమశిక్షణకు నిలయాలు అని జిల్లా కార్యదర్శి కె. శంకరరావు అన్నారు. పట్టణంలోని శ్రీ సర్వస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పోషకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాల ప్రబంధకారిణి కార్యదర్శి గణపరపు రంగారావు, పెండ్యాల హరేరామ్, విప్పర్ల సాంబశివరావు, పాఠశాల జాయింట్ సెక్రటరీ కటకం పద్మావతి మాట్లాడారు. విద్యార్థిని విద్యార్థులకు సంస్కృతి జ్ఞాన పరీక్ష సర్టిఫికెట్స్‌తో పాటు కటకం పద్మావతి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల ప్రధానాచార్యులు ధనలక్ష్మి మాతాజీ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



అచ్చంపేట: స్థానిక వాగు ఒడ్డున శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారు, గణపతి, ఆంజనేయ, నాగేంద్రస్వామివార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి పాల్గొన్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ మహోత్సవాలలో వసంతకుమారి దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ఆమె చల్లని చూపులతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా దేవాలయం, ధ్వజ స్తంభ ప్రతిష్ట



రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురిలో శ్రీ భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి నూతన దేవాలయం, ధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆడపడుచులు, బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్ట మహోత్సవంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముస్లింలకు వెన్నుదన్నుగా సీఎం జగన్

- వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే..
- నియోజకవర్గంలో ముస్లిం అభివృద్ధికి విశేషమైన కృషి
- గత ప్రభుత్వం ఒక్క మంత్రి పదవి ఇవ్వలేదు
- ఈ నెల 26న ముస్లింల ఆత్మీయ సమావేశం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్రంలో ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుదన్నుగా నిలిచారని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని, ముస్లింల అభివృద్ధి తమ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. సత్తెనపల్లిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఈనెల 26న జరగనున్న ముస్లిం మైనార్టీ సామాజిక వర్గాల ఆత్మీయ సమావేశ నిర్వహణ నేపథ్యంలో ఆదివారం జరిగిన సన్నాహక సమావేశంలో మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో ముస్లింలును రాజకీయంగా, సామాజికంగా, అభివృద్ధి పరంగా ప్రోత్సహించానని తెలిపారు. వ్యక్తిగతంగా తనకు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో రూ. 9 కోట్ల విలువైన 25 సెంట్ల స్థలాన్ని మసీదు కోసం అందించామన్నారు. ఈద్గా ప్రహరీ నిర్మాణానికి రూ. 30 లక్షలు, రాజుపాలెం మండలం కొండమోడులో కమ్యూనిటీ హాలు కోసం రూ. 30 లక్షలు, నకరికల్లు మండలం గుండ్లపల్లిలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ. 50 లక్షలు, రాజుపాలెం మండలం కొండమోడులో రూ.3 కోట్లు విలువచేసే అర ఎకరా ప్రభుత్వ స్థలాన్ని కమ్యూనిటీ హాలుకు కేటాయించినట్లు తెలిపారు. అవకాశం ఉన్నంత మేర ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తూనే ఉంటామన్నారు.గత ప్రభుత్వ హయాంలో ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా ఉప ముఖ్యమంత్రిని చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రజలను నమ్ముకున్నారని, తాను జగన్‌మోహన్‌రెడ్డిని నమ్ము కున్నానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వం చేసిన మంచిని తమ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు. ఈ నెల 26న జరిగే వైఎస్సార్ సీపీ ముస్లిం సామాజిక వర్గ ఆత్మీయ సమావేశంలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సన్నాహక సమావేశానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షత వహించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్ మీరాన్, 5,28 వార్డుల కౌన్సిలర్లు డాక్టర్ సయ్యద్ సలీం, షేక్ తాహెర్ ఉన్నిసాగని, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్ బాషా, నాయకులు గుంటూరు మేస్త్రీ షేక్ జానీ, హుస్సేనా మేస్త్రీ, ఇబ్రహీంషావలి, సుభానీఖాన్, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

జగనన్నతోనే బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బీసీల అభివృద్ధికి పెద్దపీట వేశారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బీసీల అభివృద్ధికి జగనే ఎందుకు కావాలి' అనే వాల్‌పోస్టర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ బీసీల పార్టీలుగా చెప్పుకునే టీడీపీ వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించలేదని, చట్టసభల్లో ఆశించిన స్థాయిలో సీట్లు కేటాయించలేదని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు 48 శాసనసభ , 11 పార్లమెంట్ స్థానాలు కేటాయించారన్నారు. ఈ ప్రభుత్వంలో 10 మంది మంత్రులు బీసీలు ఉన్నారన్నారు. లోక్‌సభకు ఆరుగురు, రాజ్యసభకు నలుగురిని పంపించారని తెలిపారు. ఎమ్మెల్సీలుగా 21 మంది ఉన్నారని, రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో 4,857 మంది బీసీ నాయకులకు రాజకీయ అవకాశాలు కల్పించి ప్రోత్సహించారని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు, కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందని వివరించారు. రానున్న ఎన్నికల్లో బీసీలు గంపగుత్తగా వైఎస్సార్ సీపీకే అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల వెంకట్, రాష్ట్ర అధికార ప్రతినిధి తన్నీరు సాంబయ్య, రాష్ట్ర కార్యదర్శి వేముల నాగరాజు, చల్లగుండ్ల సర్పంచ్ దేవళ్ల మల్లికార్జునరావు, చల్లా శ్రీను, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లి ఆశీస్సులలో విజయం తథ్యం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ప్రజలందరి మద్దతుతోపాటు భక్తులపాలిట కల్పతరువైన సత్తెమ్మతల్లి ఆశీస్సులలో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే నంబూరు శరకరరావు అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో తిరిగి వైఎస్సార్ సీపీ జండా రెపరెపలాడుతుందని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆదివారం అచ్చంపేటలోని షిరిడి సాయి బాబా దేవాలయం నుంచి 40కిలోమీటర్ల దూరంలో ఉన్న స్వయంభువు సత్తెమ్మతల్లి దేవాలయం వరకు పాదయాత్ర చేశారు. యాత్రను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. రెండు కిలోమీటర్లు నడిచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధిని గత ఐదేళ్లలో చేసి చూపించామన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ మంచి జరిగిందని, వారంతా వైఎస్సార్ సీపీ వైపు ఉన్నారని తెలిపారు. వీటన్నింటికితోపాటు సత్తెమ్మ తల్లి ఆశీస్సులున్నాయని, మళ్లీ సీఎంగా జగన్‌మోహనరెడ్డి అవు తారని చెప్పారు. గతంలోకన్నా భారీ మెజార్టీతో తాను గెలవబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు. సుమారు 200మంది కార్యకర్తలు, నాయకులు పాదయాత్ర చేసి సత్తెమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన అందుకూరు టీడీపీ కార్యకర్తలు

అందుకూరు(క్రోసూరు): పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలో చేరికలు పెరిగాయి. క్రోసూరు మండలం అందుకూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సిద్దిల తిరుమలరావు, చిల్కా కోటి రత్నం, చిల్కా ఆదాం తదితరులు ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

అచ్చంపేట: మండలంలోని గింజుపల్లి గ్రామానికి చెందిన 10 టీడీపీ కుటుంబాలు శనివారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరాయి. వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల్లో ప్రతి కుటుంబానికీ కుల,మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఏళ్లతరబడి టీడీపీలో ఉండి ఎంతమాత్రం ప్రయోజనం పొందనివారంతా మంచి చేసే వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారన్నారు. అందువల్ల ప్రతి రోజు గ్రామాల నుంచి స్వచ్ఛందంగా వచ్చి పార్టీలో చేరుతున్నారని చెప్పారు.



వైఎస్సార్ సీపీలో చేరిన కొనకంచి రమేష్, వెంకట్‌లతో ఎమ్మెల్యే శంకరరావు

పార్టీలో చేరిన వారిలో చీదర రమేష్, చీదర కోటయ్య, పరిమి గోపి, చీదర రామారావు, పైలా ఆదినారాయణ, చీదర నాగయ్య ఉన్నారు.

చామర్రులో....

మండలంలోని చామర్రు గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు కొనకంచి రమేష్, కొనకంచి వెంకట్ ఎమ్మెల్యే నంబూరు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసే పార్టీలకు అండగా ఉండదలచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని చెప్పారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు

అమరావతి: మండలంలోని దిడుగు గ్రామంలో ఆదివారం ముస్లింలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో కూడా జగనన్నకు ముస్లింలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వింతా బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

బెల్లంకొండలో..

మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే శంకరరావు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మల్లెల పేర్ల వెంకయ్య, భూలక్ష్మి, శ్రావణి, దుర్గి, లక్ష్మి, నరేష్, తిరుపతిరావు, శివమణి, చిన్నబాబు, బత్తుల శ్రీనుబాబు, నాగలక్ష్మి, జ్యోతి, లక్ష్మీనారాయణ, చల్లా శ్రావణి, బత్తుల భాస్కరరావు, బత్తుల చైతన్య, వెంకయ్య, మల్లేశ్వరరావు, ఆంజనేయులు, లక్ష్మణరావు, బత్తుల శ్రీను ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు అక్కల వెంకట్రామిరెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు మర్రి అనంతరామిరెడ్డి, పుణ్యాల వెంకటేశ్వరరెడ్డి, బత్తుల లక్ష్మయ్య, శివయ్య, మేకం వెంకటేశ్వర్లు, మర్రి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సత్తెమ్మతల్లి దేవాలయానికి పాదయాత్ర చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్షయ రహిత సమాజానికి కృషి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ అనూష, వైద్య సిబ్బంది

సత్తెనపల్లి: క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సత్తెనపల్లి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.అనూష తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి అవగాహన దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ రోగికి పౌష్టికాహారంతో పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ పూర్తిగా నయమవుతుందని తెలిపారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, సాయంత్రం వేళల్లో జ్వరం వస్తున్నా, దగ్గినప్పుడు గల్ల పడినా, బరువు తగ్గినా, ఆకలి లేకపోయినా, ఉమ్మిలో రక్తం పడినా క్షయగా అనుమానించి వెంటనే సమీప ప్రభుత్వ వైద్యశాలలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్ధారణ అయితే ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడాలని తెలిపారు. రూ.6 వేల నుంచి రూ. 25 లక్షల వరకు ఖరీదు చేసే మందులను ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ధర్మ సింగ్, ఎంపీహెచ్ఎస్ షేక్ ఇబ్రహీం, ఎస్‌టీఎస్ ఎన్.స్టాలిన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రోసూరులో...

స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బాల అంకమ్మబాయి ఆధ్వర్యంలో ఆదివారం క్రోసూరులో ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్ మాట్లాడుతూ క్షయ సోకిన వారికి ప్రాణభయం అక్కర్లేదని, చక్కగా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకున్నట్లయితే వ్యాధి నుంచి నివారణ పొందవచ్చని తెలిపారు. టీబీ సూపర్‌వైజర్ సౌజన్య మాట్లాడుతూ రోగులు పోషకాహారాన్ని సమృద్ధిగా తీసుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు ప్రతినెలా రూ. 500ను బ్యాంకు ద్వారా ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ రవాణా కేసులో దోషులను కఠినంగా శిక్షించాలి

సత్తెనపల్లి: డ్రగ్స్ అక్రమ రవాణాపై విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని పౌర హక్కుల సంఘం గుంటూరు, పల్నాడు జిల్లాల ఉపాధ్యక్షుడు వంకాయలపాటి ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బడా రాజకీయ నేతలు, డ్రగ్స్ మాఫియాలు కలిసి నడుపుతున్న ఈ దుర్మార్గపు నాటకంలో యువతరం సమిధులవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీలో బీసీలకు గుర్తింపు కరువు

పెదకూరపాడు: తెలుగుదేశం పార్టీలో బీసీలకు న్యాయం జరగదని, పార్టీ ఆవిర్భావం నుంచి సేవలు అందించిన గుర్తింపు ఉండటం లేదని బీసీ నాయకులు, గారపాడు మాజీ సర్పంచ్ తొరటి గోవిందరావు తెలిపారు. మండలంలోని గారపాడులో ఆదివారం ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీని నందమూరి తారక రామారావు ఏర్పాటు చేశారన్నారు. అందుకు అనుగుణంగానే ఆయన బీసీ సామాజిక వర్గానికి రాజకీయంగా, సామాజికంగా ఎంతో ప్రాధాన్యత ఇచ్చి వారి అభ్యున్నతికి దోహదపడ్డారని తెలిపారు. కానీ నేడు పార్టీలో బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. నేటి నాయకత్వం సరైన గౌరవం ఇవ్వటం లేదని చెప్పారు. దీంతో మనస్తాపం చెంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గోవిందరావు తెలిపారు.

పోలేరమ్మ ఆలయంలో మంత్రి అంబటి పూజలు



మంత్రి అంబటి రాంబాబును గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి 20వ వార్డులో ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయంలో రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు ఆదివారం పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు సాదరంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అమ్మవారి ఆశీస్సులను అందించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి అంబటి వేడుకున్నారు. అనంతరం వార్డులో నాయకులు కూకుట్ల శ్రీనివాసరావు నివాసంలో పార్టీ నేతలతో సమావేశమై, రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. ఏప్రిల్ 7న జరగనున్న జగనన్న బస్సుయాత్ర అంశాలపై శ్రేణుల్ని చైతన్యం చేశారు.ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబును గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హసంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర రెడ్డి, పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, 20వ వార్డు కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి, నాయకులు కూకుట్ల శ్రీను, కూకుట్ల రామకృష్ణ, దేవరశెట్టి రవికుమార్, సెగ్గెం వెంకటేశ్వర రావు, తుమ్మల వెంకటేశ్వరరావు, శిరిగిరి వెంకట్రావు, పెద్దింటి వెంకటేశ్వర్లు , తోట సదాశివరావు, వల్లెం నరసింహారావు, కోటిలింగం, యాంపాటి కోటిరెడ్డి పాల్గొన్నారు.

అల్లా చూపిన మంచి మార్గంలో నడవాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ పక్కన నంబూరు కల్యాణ్‌చక్రవర్తి

అచ్చంపేట: ప్రతి ఒక్కరూ అల్లా చూపించిన మంచి మార్గంలో నడవాలని, తోటివారికి సేవ చేయాలన్న మంచి మనసు ఉన్నవారికి అల్లా దయ ఎల్లప్పుడూ ఉంటుందని లోక్‌సభ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. రంజాన్ మాసంలో భాగంగా ఆదివారం రాత్రి ఆయన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తనయుడు కల్యాణ్ చక్రవర్తితో కలసి ముస్లింలకు ఇచ్చిన విందులో పాల్గొన్నారు. స్వయంగా ఆయన వడ్డన చేశారు. ముస్లింలు ఎంతో నిష్టగా రంజాన్‌మాసంలో ఉపవాస దీక్షలు పాటిస్తారన్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. అందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింలు కమల్ సైదా, బీరువాల జాని, షేక్ నాగులు, హుస్సేన్, అచ్చంపేట సర్పంచి షేక్ జాని, నియోజకవర్గ నాయకులు కృష్ణారెడ్డి, గంగాధరరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య పాల్గొన్నారు.

సంఘం పునర్వైభవానికి కృషిచేయాలి

ఆర్యవైశ్య యువజన సంఘం తాజా మాజీ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ



సత్కారం అందుకున్న వారితో కొత్త రామకృష్ణ, చిల్లంచర్ల కళ్యాణ్ తదితరులు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం గత వైభవాన్ని పునరుద్ధరించేందుకు నడుం బిగించాలని, సంఘాన్ని రాజకీయాలకు అతీతంగా నడపాలని ఆర్యవైశ్య యువజన సంఘం తాజా మాజీ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆర్యవైశ్య యువజన సంఘం నూతన అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్ అధ్యక్షతన తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్ మాట్లాడుతూ ఆర్యవైశ్య యువజన సంఘం పూర్తి కార్యవర్గాన్ని నియమించుకుని త్వరలో ప్రమాణ స్వీకారం చేస్తామన్నారు. ఎక్కువ మంది యువతను ఆకర్షించి సంఘాన్ని బలోపేతం చేస్తానని తెలిపారు. రాజకీయాలు వేరు , సంఘం వేరన్నారు. అనంతరం పెండ్యాల సందీప్, దివ్వెల సతీష్‌కుమార్, కొప్పురావూరి ప్రసాద్, త్రిపురమల్లు శ్రీనివాసరావు, దేవరశెట్టి సైదారావును సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు నారాయణ వెంకటరత్నం, శ్రీనివాసరావు, లఘుమవరపు రమేష్, భవిరిశెట్టి రంజిత్, పెరుమాళ్ల అమర్, సంపత్, సతీష్, రాజా, సాయి చరణ్, మౌర్య, సాయి, వెంకటేష్, చంద్ర, న్యాయవాదులు పాతూరి హరి మణికంఠ, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గమే అత్యుత్తమం

- భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం పండగ
- పలు గ్రామాల్లో ర్యాలీలు



క్రోసూరులో మట్టల పండుగ ర్యాలీ

అమరావతి: మండలంలోని ధరణికోట లూథరన్ చర్చిలో ఆదివారం మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఫాస్టర్ రెవరెండ్ సత్యానంద్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులు, సంఘపెద్దలు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. తొలుత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ సత్యానంద కుమార్ మాట్లాడుతూ క్రైస్తవుల ఆరాధ్యదైవమైన ఏసుక్రీస్తు మార్గమే అత్యుత్తమమైనదన్నారు. ఈ ప్రపంచానికి రాజుగా గుర్తించి జెరూసలేనికి విచ్చేసిన శుభ సందర్భాన భక్తులందరూ ఈతాకులను పూలతో అలంకరించి ఆయనకు ఘనస్వాగతం పలికారని తెలిపారు. అప్పటి నుంచి ఈస్టర్ పండుగకు ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా గుర్తించి ప్రత్యేక పండుగగా జరుపుకుంటున్నామని వివరించారు. ఊరేగింపులో భక్తులు, పెద్ద ఎత్తున చిన్నారులు రంగురంగుల పూలతో అలంకరించి ఈత ఆకులను చేతపట్టి ప్రభు ఏసు సువార్తను పలుకుతూ పాల్గొన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల చర్చిల్లో మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు.

క్రోసూరులో..

స్థానిక లూథరన్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ ఎం.సుందరరావు ఆధ్వర్యంలో మట్టల పండుగ ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుక్రీస్తును శిలువ మరణానికి అప్పగించడానికి ముందు నాటి ప్రజలు ఆయన్ను యూదుల రాజుగా ఊరేగింపుగా జెరూషలేనికి తీసుకువెళ్లిన రోజును ఉద్దేశించి మట్టల పండుగ నిర్వహిస్తారని తెలిపారు. విశ్వాసులతో పాటు సండే స్కూల్ విద్యార్థులు ఈతమట్టలు పట్టుకొని, క్రీస్తు పాటలు పాడుతూ గ్రామ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు కార్యక్రమంలో సంఘ పెద్దలు, విద్యార్థులు, విశ్వాసులు, ఉపాధ్యాయులు, భక్తులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

మండలంలోని పలు గ్రామాల్లోని క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు రాకను పురస్కరించుకొని స్వాగతం పలుకుతూ చిన్నారులు, మహిళలు ఈత మట్టలను పూలతో అందంగా అలంకరించి వాటితో క్రీస్తు గీతాలు ఆలపిస్తూ గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చర్చిల్లో జరిగే సామూహిక ప్రార్థనలలో పాల్గొంటారు. ఆయా చర్చిలలో సంఘ కాపరులు క్రీస్తు సందేశాన్ని అందించారు.

పెదకూరపాడులో..

మండల వ్యాప్తంగా మట్టల ఆదివారం వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ రెవరెండ్ పుట్టి సుందరరాజు, ఫాదర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్య పూజ బలి నిర్వహించారు. అనంతరం క్రైస్తవులు మట్టలను చేతపట్టుకొని గ్రామ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పెదకూరపాడులోని క్రీస్తు లూథరన్ చర్చ్ తెలుగు బాప్టి చర్చ్ హోసన్నా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నకరికల్లులో..

మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చేజర్ల చర్చిలో పాస్టర్ రాజేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దైవ సందేశకులు పండుగ ప్రాధాన్యతను వివరించారు. ఉపవాస దీక్షలో ఉన్న క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

స్థానిక పరిశుద్ధ మత్తయి లూథరన్ దేవాలయంలో సంఘ కాపరి రెవరెండ్ మత్తయ్య ఏసుక్రీస్తును కీర్తిస్తూ ప్రార్థనలు చేశారు. మట్టల ఆదివారం ప్రాముఖ్యత గురించి వివరించారు.

ఒరిజినల్ పాసుపోర్టు పోయినది

షేక్ బాజి తండ్రి షేక్ జాన్ మహబూబ్ పాకాలపాడు గ్రామము, సత్తెనపల్లి మండలము, పల్నాడు జిల్లా. ది.15.3.2024 పాకాలపాడు నుండి సత్తెనపల్లి బైక్‌పై వెళ్ళుచుండగా పోయినది. నా పాసుపోర్టు నంబరు S1479788 దొరికినవారు పై అడ్రసుకు తెలియపరచగలరు.

సెల్ నెం: 9848467466

వేంకటేశ్వరునికి లక్ష మల్లెపూల పూజ



ప్రత్యేక పూజలో స్వామి

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో ఫాల్గుణ పూర్ణమి సందర్భంగా 108 మంది మాతృమూర్తులతో లక్ష మల్లెపూల పూజ ఆదివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు పులిపాటి శ్రీరామమూర్తి, భుజంగరావు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, సీతయ్య, సీతారామాంజనేయులు, వసంతరావు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి జగనన్నను మళ్లీ గెలిపించాలి



కర్లపూడిలో ప్రచారం చేస్తున్న వసంతకుమారి

అమరావతి: పేదల పక్షపాతి జగనన్నను మరోసారి గెలిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నంబూరు వసంతకుమారి కోరారు. ఆదివారం మండల పరిధిలోని కర్లపూడిలో ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డిని ఎదుర్కోలేక టీడీపీ, జనసేన, బీజేపీ అక్రమ పొత్తులు పెట్టుకున్నాయని తెలిపారు. ఎంతమంది కలిసి వచ్చినా.. జగనన్న సైన్యం ముందు నిలబడలేరని పేర్కొన్నారు. బూటకపు హామీలతో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న వారిని ప్రజలే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పెదకూరపాడులో భారీ మెజారిటీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మంచికలపూడి వీరరాఘవయ్య ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(సత్తెనపల్లి, పెదకూరపాడు)
99516 02950
Office mail : sakshigntadvt@gmail.com